తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-30- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 212 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో
# తీరని అన్యాయం

- పాలమూరు `రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం
- డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు
- పైగా 90శాతం పనులు పూర్తయ్యాయనే దుష్ప్రచారం
- సాగునీటి జలాలపై చర్చలో మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ మచ్చట్లు):**
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి డీపీఆర్ సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారని ఉత్తమ్ ఆరోపించారు.

మిగతా 2లో

## యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో
# సంక్షేమ పథకాలు

**ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్'**
**అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ మచ్చట్లు):**
ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి, ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రవీంద్ర భారతిలో అట్టహాసంగా జరిగింది.

మిగతా 2లో





## రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయిన కేసీఆర్

చతెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్.. పట్టుమని అరగంట కూడా ఉండకుండా వెళ్లిపోయారు. అయితే ఈలోపే సభలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి.
మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆపై శాసన సభ ప్రారంభం అయ్యి.. జాతీయ గీతం ఆలాపన దాకా ఉన్నారు. అంతకంటే కాస్త ముందు..

2లో



## కొడగట్టుకు రానున్న పవన్ కళ్యాణ్

- లకొండగట్టుకు రానున్న పవన్ కళ్యాణ్
- 3న డిప్యూటి సిఎం షెడ్యూల్ ఖరారు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**జగిత్యాల,డిసెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

2లో



## తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

**అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం**

**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**
హుజూరాబాద్‌లో పెద్ద ఆయకట్టు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని పేర్కొన్నారు.
వెంటనే ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు.

మిగతా 2లో

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

- హాజరైన సిఎం రేవంత్, విపక్షనేత కేసీఆర్
- కెసిఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సిఎం వాకబు
- కెసిఆర్‌ను కలిసి పలకరించిన మంత్రులు
- కెసిఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు
- అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు



**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది.

మిగతా 2లో

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్



- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- అందుకు ఎంపిటిసి, జడ్పిటిసిలపై వెనకడుగు
- తెలంగాణ తెచ్చిన నేతగా కెసిఆర్‌ను గౌరవించాలి
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**
అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో

మిగతా 7లో




## ఉద్యోగులకు పిఆర్సి ఏమయ్యింది

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా దక్కడం లేదు
- హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**
బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇయ్యాల్సిన పీఆర్సీ గానీ, డీలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కుసంబంధించిన ఒక్క రూపాయి కూడా పెండిరగ్ పెట్టలేదని హరీష్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని,

మిగతా 7లో



## సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

**సినీనటి మాధవీలతకు బిగ్ షాక్**
**సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు**

**హైదరాబాద్,డిసెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

7లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండిరచారు. అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా

అవుతుందని ఆయన ప్రశ్నించారు. పెండిరగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి వాటిని కూడా తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తమ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతోనే పూర్తి చేసి తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాము అధికారంలోకి వచ్చాక 11 పంపుల ఇన్స్టాలేషన్ పూర్తి చేశామని, ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని వెల్లడిరచారు. ఈ నేపథ్యంలో



మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు.

ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీలు డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని హరీశ్‌రావు దుష్ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తానని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని హితవు పలికారు. వారు ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాగునీటి జలాలపై డీపీఆర్‌ను కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్ పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.



# యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... రాష్ట్రటూరిజం, కల్చరర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించి, అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 3లక్షలు, రెండో బహుమతి 2లక్షలు, మూడో బహుమతి 1లక్ష.. షార్ట్ ఫిల్మ్, బతుకమ్మ వీడియో విభాగాలకు వేరు వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం సినిమాటోగ్రఫీ మంత్రిగా నాకు ఎంతో గర్వకారణం. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు నా హృదయ పూర్వక అభినందనలు తెలుపుతున్నాను. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను గతంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా చూసాను.. ఇటీవల వచ్చిన 'దండోరా' సినిమా చూసాను..సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా, హృదయానికి దగ్గరయ్యే విధంగా ఉన్నాయి అని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో సినిమాలు తీసుకోవడానికి లోకేషన్స్ పరంగా కూడా టూరిజం డెవలప్మెంట్ చేస్తున్నామని, దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఘాట్ రోడ్డు, అటవీ మార్గాన వెళ్లే బాధలు తప్పించేందుకు 8వేల కోట్లతో మన్ననూర్ `శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం. ఇది సినిమా, షార్ట్ ఫిలిమ్స్‌కు మంచి లొకేషన్ అవుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, :ఎఫ్‌డిసి ఛైర్మన్ సీహెచ్.ప్రియాంక, దర్శకులు హరీష్ శంకర్, తనికెళ్ళ భరణి, దశరథ్, రాహుల్ సిప్లిగంజ్, అశోక్ కుమార్, శ్రీలక్ష్మి, పీ.జీ. విందా, మంగ్లీ, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తోపాటు పెద్ద సంఖ్యలో యువ దర్శకులు, కళాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు పెండిరగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి ఎన్నిరోజులపాటు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మాజీ ముఖ్యమంత్రి,



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్ సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు.

దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు`రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయిన కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చతెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్.. పట్టుమని అరగంట కూడా ఉండకుండా వెళ్లిపోయారు. అయితే ఈలోపే సభలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి.

మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆపై శాసన సభ ప్రారంభం అయ్యి.. జాతీయ గీతం ఆలాపన దాకా ఉన్నారు. అంతకంటే కాస్త ముందు..

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత వద్దకు వెళ్లి పలకరించారు. షేక్ హ్యాండ్ ఇచ్చి కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆ సమయంలో కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తప్ప అంతా నిల్చున్నారు.

ఆపై మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి సహా అధికార పార్టీ విప్‌లు కూడా కేసీఆర్‌ను పలకరించారు. నూతనంగా ఎన్నికైన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



సైతం కేసీఆర్‌ను పలకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అయితే.. ఆ తర్వాత ఆయన సభలో కనిపించలేదు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో సంతకం చేసిన అనంతరం జీరో అవర్ ప్రారంభం కాకముందే కేసీఆర్ వెళ్లిపోయారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నందినగర్ నివాసానికి చేరుకున్నారు.

కాగా, కృష్ణా జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలున్నాయి. ఈ అంశంపై ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందనతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధాన్ని బట్టి చూస్తే ఈసారి అసెంబ్లీ వాడీవేడిగా జరగనుందని తెలుస్తోంది. ఈసారి కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టుపడుతోంది. అయితే నేటి పరిణామం నేపథ్యంలో కేసీఆర్ సభకు హాజరవుతారా? లేదా? అనే ఉత్కంఠ కొనసాగనుంది.

# తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

(మొదటి పేజీ తరువాయి)

కౌశిక్ రెడ్డి మాట్లాడుతుంటే ఆయన ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించారు.

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.

2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల



ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే.. దీనిపై న్యాయ విచారణ చేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కృంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండిరచింది.

# కొండగట్టుకు రానున్న పవన్ కళ్యాణ్

**జగిత్యాల,డిసెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు.



ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి






- మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ఆకస్మిక పర్యటన

**మల్కాజిగిరి, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ సోమవారం ఉదయం 6 గంటల నుంచే పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా లాలాపేట్ ఫ్లైఓవర్, మౌలాలి హజరత్ అలీ అబిన్ కోయి మౌలాలి దర్గా పరిసర ప్రాంతాలు, నేరేడ్మెట్ ఎఫ్ఓబి (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్) మరియు వాయుపురి చెత్త ట్రాన్స్ఫర్ స్టేషన్‌లను పరిశీలించారు.మౌలాలి దర్గా పుట్టినరోజు మరియు ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో భక్తులు, యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా ఉండాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. దర్గా పరిసరాల్లో పారిశుధ్య పనులు మూడు షిఫ్టులుగా నిర్వహించాలని, అవసరమైన చోట్ల డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, కొండపై బహిరంగంగా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నేరేడ్మెట్‌లోని ఎఫ్ఓబి తనిఖీలో పారిశుధ్య లోపాలు గుర్తించిన కమిషనర్, ప్రతిరోజూ శుభ్రం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు.లాలాపేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి తనిఖీలో సెంట్రల్ డివైడర్‌పై రాళ్లు, మట్టి కుప్పలు, పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే వాయుపురి చెత్త ట్రాన్స్ఫర్ స్టేషన్ పనితీరును పరిశీలించి, రోజువారీగా చెత్త నిల్వలు లేకుండా వెంటనే జవహర్‌నగర్‌కు తరలించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, ఈఈ లక్ష్మణ్, సర్కిల్ ఉపవైద్యాధికారి డాక్టర్ కె. మంజుల, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) మహేశ్వర్, ఏఈ మధురిమ, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ భర్త పై దాడి కేసు కుట్రనేనా..?

- ఎమ్మెల్యే అనుచరుల భూ దందాకు సహకరించని కార్పొరేటర్ భర్త.
- 3 కోట్ల భూమి ఎసరు పెట్టిన అనుచరులు.
- ఆ అధ్యక్షుడు వివాదల కేంద్రం.

**హసన్ పర్తి, డిసెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):** కార్పొరేటర్ భర్త పై దాడి కేసు నమోదు చేయడం కుట్ర లో భాగమేనని కార్పొరేటర్ భర్త జక్కుల వెంకటేశ్వర్లు సోమవారం మీడియాతో ఒక ప్రకటన లో అన్నారు. తన వర్గానికి చెందిన కాలనీలో ప్రధాన కార్యదర్శి ఇంటి వరకు రోడ్డు పనులు చేయడం లేదన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన తన పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి దుర్భాషలాడిన క్రమంలో జరిగిన చిన్న సంఘటన నియోజకవర్గ ఎమ్మెల్యే అనుచరులు కావాలనే రాజకీయంగా అణగదొక్కడానికి వేసిన భారీ స్కెచ్ అని అన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారిన తాను డివిజన్ అభివృద్ధి చేయకుండా తమ సొంత ప్రయోజనాల కోసం పనిచేయాలని ఒత్తిడి చేస్తూ మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి మంజూరు చేయించిన తమకు తెలియకుండా అభివృద్ధి జరగకూడదని ఎమ్మెల్యే తో ఒత్తిడి చేయించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే అనుచరుల భూదంద కు అడ్డుగా ఉన్నాడని కేసు నమోదు.

నక్షత్ర కాలనీ ని అనుకుని ఉన్న వెంచర్ లో భూ వివాదం ఉన్న ప్లాట్ లో ఎమ్మెల్యే అనుచరులు చొరబడి అక్రమంగా వారిని బెదిరించి మూడు కోట్ల భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ విషయంలో కార్పొరేటర్ భర్త తమకు సహకరించడం లేదని నానా రకాలుగా వేధింపులకు గురిచేసి,కేసులు నమోదు చేసే ప్రయత్నంతో ఇలాంటి కేసుల లో ఇరికించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి,ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే నన్ను ఇలాంటి కేసులు ఏమి చేయలేవని ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలానగర్ గా నామకరణం(602/2022) 1986 సంవత్సరంలో బాలయ్య,నాగయ్య జ్ఞాపకార్థం అక్కడ ఓ వెంచర్ చేయడం జరిగిందని 2018,2019, 2020 సంవత్సరాలలో పలువురు కొన్ని ఇండ్లు నిర్మాణం చేసుకొని కాలనీవాసులు నక్షత్ర కాలనీ అని పేరు పెట్టుకున్నారని అదే క్రమంలో అప్పట్లో 2021లో కార్పొరేటర్ కాలనీ వాసులతో ఆ కాలనీ నుండి పక్క కాలనీకి రోడ్డు కోసం తన సొంత ఖర్చులతో తొమ్మిది లక్షల రూపాయలు తో ఓ ప్లాట్ కొని రోడ్డు వేసే విధంగా మిగిలిన స్థలంలో కాలనీకి కమ్యూనిటీ హాల్ నిర్మించే విధంగా ఒప్పందం చేసుకుని కాలనీ పేరు బాలనగర్( రిజిస్ట్రేషన్ నెంబర్ 602/2022)గా మార్చడానికి అంగీకరించారని తెలిపారు.కొత్త ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే అనుచరులు పాత కాలనీ అధ్యక్షున్ని తప్పించి తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తి ని నూతన అధ్యక్షునిగా పెట్టుకుని సుమారు 3కోట్ల విలువైన ఆ భూమిని కాజేసేందుకు తన మీద కేసులు వేసి అనేక ఆరోపణలు చేస్తూ రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఆ అధ్యక్షుడు వివాదాలకు కేంద్రం.

నక్షత్ర కాలనీ( బాలనగర్) కాలనీలో అధ్యక్షుడిగా కొనసాగుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు రియల్ ఎస్టేట్ వ్యవపారాలు చేస్తూ ఆ చుట్టుపక్కల కాలనీలలో ఆ ప్రాంతంలో పలు భూ వివాదాలకు,పంచాయతీలకు కేంద్రంగా మారారని చుట్టుపక్కల కాలనీవాసులు పలువురు తెలుపారని నక్షత్ర కాలనీ పక్కన గల సుమారు మూడు కోట్ల విలువగల భూమిలో పలు వివాదాస్పద ప్లాట్లను కొందరి రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి అమ్మినట్లు తెలుస్తుంది ఈ నేపథ్యంలో పలువురు ఆ అధ్యక్షునిపై కేయూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులపై ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

# మోజర్ల గ్రామంలో ఘనంగా ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం





**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్నికైన ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణ స్వీకార అనంతరం నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ రాయికంటి రాములు గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని, గ్రామస్తులందరూ కలిసి పనిచేస్తే మోజర్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని అన్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజలతో కలిసి ముందుకు సాగుతూ, పంచాయతీ సభ్యుల సహకారంతో గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామస్తులు, అధికారులు నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచిగా రాయికంటి రాములు యాదవ్, వార్డు సభ్యులుగా ఆడెం లక్ష్మి, వాకిటి స్వర్ణలత, మద్దల ఆంజనేయులు, గట్టు సతీష్, గట్టు వరలక్ష్మి, గట్టు నాగమన్నెమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు మన్యం, మాజీ సర్పంచ్ సునీత తిరుపతయ్య, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్ ,పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు,గ్రామ పెద్దలు బిక్షపతి, నరసింహారెడ్డి, జగదీష్ రెడ్డి, రాములు యాదవ్, ఆంజనేయులు, గట్టు వెంకటన్న, రాజా వర్ధన్ రెడ్డి, మార్చ రవీందర్ ,గట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకల్లో మార్పు... సేవా కార్యక్రమాలకు పిలుపు.!



- డబ్బులు వృథా చేయకుండా చిన్నారుల భవిష్యత్తుకు చేయూత.
- ఎమ్మెల్యే మట్టా రాగమయి.

**సత్తుపల్లి, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జనవరి 1 నూతన సంవత్సరం సందర్భంగా, అలాగే జనవరి 3, 2026 నాడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే శుభాకాంక్షల కార్యక్రమాలకు సేవా రూపం ఇవ్వాలని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎటువంటి శాలువాలు, బొకేలు, స్వీట్స్, కేకులు తీసుకురావద్దని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం తెలిపింది. వాటి బదులు పేద కుటుంబాల పిల్లలకు ఉపయోగపడే వస్తువులు అందించాలని విజ్ఞప్తి చేసింది.

బడి పిల్లలకు అవసరమైన పెన్నులు, నోట్ బుక్స్, బ్యాగులు, దుప్పట్లు, ప్లేట్లు, విజ్ఞానం పెంపొందించే పుస్తకాలు, కంపాస్ బాక్సులు, గ్లాసులు, వాటర్ బాటిల్స్ వంటి వస్తువులను తమ ఆర్థిక పరిస్థితిని బట్టి జనవరి 1 మరియు జనవరి 3 తేదీల్లో అందజేయాలని సూచించారు.

డబ్బులు వృథా కాకుండా, ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# నాచారం వాసవి సేవా సమితి 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ



**నాచారం,డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజ సేవలో తమ వంతు బాధ్యతగా సేవలందించాలనే సంకల్పంతో ఏర్పాటైన శ్రీ వాసవి సేవా సమితి పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. నాచారం వాసవి సేవా సమితి 10వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.2016 సంవత్సరంలో కేవలం 17 మంది సభ్యులతో ప్రారంభమైన వాసవి సేవా సమితి నేడు వంద మందికి పైగా సభ్యులతో విస్తరించడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ, కరోనా కష్టకాలంలో పేద ప్రజలకు ఆహార ధాన్యాలు పంపిణీ చేసి ఆదుకున్నారు.ప్రతి అమావాస్య రోజున నాచారం మహంకాళి దేవాలయం వద్ద సుమారు 1200 మందికి అన్నదానం నిర్వహిస్తున్నామని సమితి నిర్వాహకులు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా వాసవి సేవా సమితి నిర్వాహకుడు శ్రీరామ్ సత్యనారాయణను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా వాసవి సేవా సమితి ముందుకు సాగుతుందని సభ్యులు పేర్కొన్నారు.

# మృతిచెందిన నాగమ్మ కుటుంబానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆర్థిక సాయం



**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన కొమ్ము కల్లుబండి నాగమ్మ (65) ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందగా, ఈ విషాద ఘటనపై రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. మృతురాలి కుటుంబానికి ఆయన ఆర్థిక సాయం అందజేశారు.మాజీ మంత్రి ఆదేశాల మేరకు సోమవారం పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.5,000 నగదు సాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సేనాపతి, జంగం రమేష్, పురుషోత్తం రెడ్డి, బుజ్జిబాబు, సింగిరెడ్డి కురుమూర్తి, సుర శ్రీనివాసులు, కొమ్ము కుతల నరసింహ, కొమ్ము బ్రహ్మం, కొమ్ము విష్ణు, కొమ్ము శివకృష్ణ, సింగిరెడ్డి వెంకటస్వామి, గొల్ల మోగిలయ్య, కొమ్ము నరసింహులు, తాడిపర్తి వెంకటయ్య, కొమ్ము కురుమయ్య, గుడిసె మల్లేష్, కొమ్ము నాగరాజు తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాచారం సర్కిల్‌ను మల్లాపూర్ సర్కిల్‌గా పునర్వ్యవస్థీకరించాలి



- జిహెచ్ఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి

**నాచారం, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను మీర్పేట్ హౌసింగ్ బోర్డు కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నాచారం సర్కిల్ కార్యాలయాన్ని మల్లాపూర్ సర్కిల్‌గా పునర్వ్యవస్థీకరించాలంటూ వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సౌలభ్యం దృష్ట్యా సర్కిల్ కార్యాలయాన్ని మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయడం అత్యవసరమని కమిషనర్‌కు వివరించారు. మల్లాపూర్ ప్రాంతంలో వేగంగా పెరుగుతున్న జనాభా, పట్టణాభివృద్ధి, పరిపాలనా ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుంటే ఈ మార్పు అవసరమని తెలిపారు. సర్కిల్ కార్యాలయం మల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తే పరిపాలనా సామర్థ్యం మరింత పెరిగి, అధికారుల మధ్య సమన్వయం మెరుగవుతుందని, ప్రజల ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అన్ని డివిజన్‌లకు కేంద్ర బిందువుగా మల్లాపూర్ సర్కిల్ ఉపయోగపడుతుందని కమిషనర్‌తో జరిగిన చర్చలో వారు స్పష్టం చేసినట్లు తెలిపారు.

మంగళవారం - 30 - డిసెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఆన్‌లైన్ వర్క్ పేరుతో ఆశాలపై వేధింపులు ఆపాలి

- **కోటి కమిషనర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్స్ ధర్నా**

**హైదరాబాద్, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్లపై ఆన్‌లైన్ వర్క్ పేరుతో జరుగుతున్న వేధింపులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోటి కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. అనిత అధ్యక్షత వహించారు. అనంతరం జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాత్రమే ఆశాలతో అధికంగా ఆన్‌లైన్ పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ పనులపై పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల సర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని, ఆశాలపై దుర్భాషలాడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.జిల్లా యూనియన్ జనరల్ సెక్రటరీ ఏం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, యువిన్, ఎంసీటీసీ కిట్లు, ఈ-సంజీవని, ఈ-ఔషధి, ఎన్సీడీ, సీ-బ్యాంక్, స్క్రీనింగ్, ఫాలోఅప్స్ వంటి పనులను సరైన శిక్షణ, వసతులు కల్పించకుండా ఆశాలతో ఆన్‌లైన్‌లో చేయిస్తున్నారని తెలిపారు. రోజుకు 50 నుంచి 100 ఎంట్రీలు చేయాలంటూ టార్గెట్ల పేరుతో వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లు, నెట్ రీచార్జీలకు ఎటువంటి ఖర్చులు చెల్లించకుండానే తక్కువ పారితోషికాలతో ఆశాలను ఖరీదైన ఫోన్లు కొనాలని ఒత్తిడి తెస్తున్నారని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బాలనగర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏడు మంది ఆశా వర్కర్లకు అక్టోబర్ నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఏ. అశోక్, యూనియన్ జిల్లా నాయకులు ప్రవీణ, కోమలత, వర్కింగ్ కమిటీ సభ్యుడు ఉన్ని కృష్ణన్, బాలనగర్ సీఐటీయూ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు.

## మోజర్లలో బిఆర్ఎస్ ఏకైక వార్డు సభ్యుడిగా గట్టు సతీష్ ప్రమాణ స్వీకారం





**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి ఏకైక వార్డు సభ్యుడిగా గట్టు సతీష్ విజయం సాధించారు. మొత్తం 10 వార్డులకు గాను 9 వార్డులను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగా, ఒక్క వార్డును బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం విశేషం. నూతనంగా ఎన్నికైన సందర్భంగా గట్టు సతీష్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. మోజర్ల గ్రామ మాజీ సర్పంచ్ సునీత తిరుపతయ్య, బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నరసింహారెడ్డి, అధికారులు గట్టు సతీష్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గట్టు సతీష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వాన్ని అనుసరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.

# కిష్టారం – తాళ్లమడ రహదారి మృత్యుమార్గంగా మారింది.!







- **తమ్మిలేరు వంతెన వద్ద వరుస ప్రమాదాలు.**

**సత్తుపల్లి, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణ పరిధిలోని కిష్టారం నుంచి తాళ్లమడ వరకు సాగాల్సిన ప్రధాన రహదారి ప్రజలకు మృత్యుమార్గంగా మారుతోంది. సత్తుపల్లి దాటిన అనంతరం ఉన్న తమ్మిలేరు వంతెన ప్రాంతం వరుస రోడ్డు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. ఈ వంతెన వద్ద జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల సంవత్సరాల్లో లారీలు, భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వంతెనపై నుంచి లోయలో పడిపోయిన ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ప్రమాదాల తీవ్రత అధికంగా ఉండటంతో అనేక కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయని పేర్కొంటున్నారు.

తమ్మిలేరు వంతెన వద్ద ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు అలైన్‌మెంట్ లోపమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. సహజంగా నేరుగా సాగాల్సిన రహదారిని అకస్మాత్తుగా వంకరలతో మలిచిన కారణంగా వాహనాలు అదుపు తప్పుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో, వర్షాకాలంలో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. వంతెనపై గుంతలు, సరైన రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడం కూడా ప్రమాదాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయని వాపోయారు.

రహదారి నేరుగా నిర్మించి ఉంటే ఇన్ని ప్రమాదాలు చోటుచేసుకునేవి కావని, ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వంతెన ప్రమాదకరమని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చేపట్టలేదని విమర్శలు ఉన్నాయి. తాత్కాలిక మరమ్మత్తులు, గుంతల పూడికతోనే సరిపెట్టారని, ప్రజల భద్రతపై నిర్లక్ష్యం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తమ్మిలేరు వంతెన అలైన్‌మెంట్‌ను తక్షణమే నిపుణుల కమిటీతో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ వంతెనపై ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

ఇది రాజకీయ అంశం కాదని, అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రజల ప్రాణాల పరిరక్షణకు సంబంధించిన అంశమేనని వారు స్పష్టం చేశారు. ఈ విషయంపై బీజేపీ పార్టీ కూడా అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## జిల్లాలో యూరియా ఎరువుల కొరత లేదు కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ రోజు వరకు 773 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి యూరియా సేల్ కౌంటర్ వద్ద షామియానా, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6.00 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వలు సాగుకు పూర్తిగా సరిపోతాయని, అవసరాన్ని బట్టి అదనపు సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. యూరియా విషయంలో కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కోరారు.

## సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడిగా కోలికపోగు సర్వేశ్వరరావు ఎన్నిక.!



**సత్తుపల్లి, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా సిఐటియు 12వ మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో ఖమ్మం పట్టణంలోని మంచికంటి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన మహాసభల అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన సిఐటియు నాయకులు కోలికపోగు సర్వేశ్వరరావును జిల్లా కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన కార్మిక నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. కార్మిక హక్కుల పరిరక్షణకే ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ పోరాడుతున్న నాయకుడిగా జిల్లా నాయకత్వం ఆయనను జిల్లా కమిటీలోకి ఎంపిక చేసింది.

ఈ ఎన్నిక పట్ల పలు ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, పట్టణ ప్రముఖులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కోలికపోగు సర్వేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## మత్స్య శాఖ ఆధ్వర్యంలో వెల్టూర్ చెరువులో చేప పిల్లల వదిలింపు



- **చేపల పెంపకంలో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి**
- **మత్స్యశాఖ అధికారులు భరత్, వీరేష్**

**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని గోపాల సముద్రం చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల వదిలింపు కార్యక్రమం నిర్వహించారు. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మత్స్యశాఖ అధికారులు భరత్, వీరేష్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ ద్వారా అందించిన రెండు లక్షల 67 వేల (2,67,000) చేప పిల్లలను చెరువులో వదలడం జరిగిందని వారు వివరించారు.దీని వల్ల చెరువులో మత్స్య సంపద పెరిగి, రానున్న కాలంలో చేపల దిగుబడి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మత్స్యశాఖ అమలు చేస్తున్న పథకాలను మత్స్యకారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో మత్స్యకారుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చెరువుల సంరక్షణతో పాటు చేపల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే గ్రామానికి మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. మత్స్యకారులకు గ్రామ పంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.గ్రామ మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ.. మత్స్యశాఖ సహకారంతో సబ్సిడీ ద్వారా చేప పిల్లలు అందించడం మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ ఉపాధ్యక్షులు సతీష్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు గ్రామ మత్స్యకారులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీహరికి ఘన స్వాగతం



**కాప్రా, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ హైదరాబాద్ ఉప్పల్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా శ్రీహరి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా సమాచార హక్కు చట్టం నిర్వాహకులు తాడూరి గగన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గగన్ కుమార్ మాట్లాడుతూ, కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు విస్తృతంగా జరుగుతున్నాయని, వీటన్నింటిపై కఠిన చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలని కోరారు. అలాగే జిహెచ్ఎంసీ ద్వారా మంజూరవుతున్న పర్మిషన్లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిప్యూటీ కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరికి కాప్రా సర్కిల్‌కు స్వాగతం తెలుపుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అక్రమ నిర్మాణాల నియంత్రణలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. డిప్యూటీ కమిషనర్‌గా శ్రీహరి చేపట్టిన బాధ్యతలు విజయవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన కొమ్ము నాగమ్మ (75) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మానవత్వంతో స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ మరియు పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందే ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు సైతం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్య గంగా రవి, మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, 6వ వార్డ్ మెంబర్ కొమ్ము సత్యనారాయణ, టిఎంఆర్ నాయకులు గట్టు రాజశేఖర్, ఎస్. శివకుమార్, ఆర్. నాగరాజు, ఎస్. కురుమూర్తితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.తమ కష్టకాలంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి నాగమ్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మణిగిల్ల గ్రామంలో పోచమ్మ గుడి బాట రోడ్డు పనులకు శ్రీకారం



- **ఎన్నికల హామీని నెరవేర్చిన నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,డిసెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ ఆరాధ్య దేవత పోచమ్మ ఆలయానికి వెళ్లే బాట రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామ అభివృద్ధికి సంవత్సరాల తరబడి మరుగున పడి, అభివృద్ధికి నోచుకోని పోచమ్మ బాటకు నూతన రూపు కల్పించేందుకు ఈ పనులను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తొలి నిర్ణయంగా అమలు చేస్తూ, తన మొదటి మాటను నిలబెట్టుకున్న సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ నిర్ణయం గ్రామ ప్రజల్లో హర్షాతిరేకాలను కలిగించింది. గ్రామ ప్రజలతో పాటు భక్తులకు సౌకర్యంగా ఉండేలా చారిత్రక నిర్ణయం తీసుకున్నారని గ్రామస్థులు కొనియాడారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సుంచార మోని రాములు, శేఖర్ గౌడ్, తిరుపతయ్య, రాజశేఖర్ సాగర్, వెంకటయ్య, బాలరాజు, కొములయ్య, నాగరాజు గౌడ్, బాబు రామకృష్ణారెడ్డి, ప్రతాప రెడ్డి, రామిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్ రెడ్డి, బీకే నాయుడు బాలాజీ, ఎర్ర తిరుపతి, బోడి గణేష్, బోయిన్ కృష్ణ, ఆనంద్ రెడ్డి, కావాలి శివ, శివ కృష్ణ, జయలాలు, వడ్డే సూరి, మండల శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

## 14 ఏళ్ల నాటి మహిళ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు..
### దోషికి మరణశిక్ష




మహిళ హత్య కేసుకు సంబంధించి మేడ్చల్ మల్కాజ్‌గిరి మూడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. దోషి కరణ్ సింగ్‌కు మరణ శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన కరణ్ సింగ్ హైదరాబాద్‌లో ఇనుప పనిముట్లు తయారు చేస్తుంటాడు. 2011 జులై 18న సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌లో ఓ మహిళపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అప్పట్లో ఈ ఘటన పెను సంచలనంగా మారింది. హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు కేవలం రోజుల వ్యవధిలోనే కరణ్ సింగ్‌ను పట్టుకున్నారు. అనంతరం కీలక ఆధారాలు సేకరించారు. దర్యాప్తు చేసి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. వాదనలు విన్న మేడ్చల్ జిల్లా న్యాయస్థానం కరణ్ సింగ్‌ను దోషిగా తేలుస్తూ మరణశిక్ష విధించింది.





## కాప్రా సర్కిల్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

**కాప్రా, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 29 నుంచి జనవరి 31, 2026 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు షెడ్యూలు జారీ చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావు నగర్ డివిజన్‌లో ప్రత్యేక శుభ్రత పనులు చేపట్టారు.డివిజన్‌లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌తో పాటు పరిసర ప్రాంతాలు, సర్కిల్ లోని ప్రధాన రహదారులపై ఉన్న సెంటర్ మెరిడియన్‌లు, సెంటర్ డివైడర్లను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. రహదారులపై పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో భాగంగా చెరువుల పరిసరాలను శుభ్రపరచాలన్న ఆదేశాల మేరకు కాప్రా చెరువు పరిసర ప్రాంతాలను కూడా పూర్తిగా శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద, మెడికల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది, ఎస్ఎఫ్ఐ జవాన్లు పాల్గొన్నారు.






## జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలి
### కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

**చిల్కానగర్, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. చిల్కానగర్ డివిజన్ పరిధిలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ, 2020 నవంబర్‌లో పార్టీ అధిష్ఠానం తనకు అవకాశం కల్పించిన నాటి నుంచి గత నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో నాయకుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేసిన ఫలితంగా రూ.110 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయగలిగామని పేర్కొంటూ, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.డివిజన్ అభివృద్ధిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారం ఎంతో కీలకమైందని కొనియాడారు. ఆయన సహకారంతోనే చిల్కానగర్ డివిజన్‌ను నియోజకవర్గంలోనే నంబర్ వన్ డివిజన్‌గా తీర్చిదిద్దగలిగామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అధిష్ఠానం ఎవరికీ అవకాశం కల్పించినా, అందరం కలిసికట్టుగా పని చేసి డివిజన్‌లో బీఆర్ఎస్ జెండా ఎగిరేలా కష్టపడి విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా కోర్టు ఆవరణలో
### మూడు కొత్త కోర్టులు ప్రారంభం



**కుషాయిగూడ, డిసెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవలను మరింత విస్తరించేందుకు మరో మూడు కోర్టులు నూతనంగా అందుబాటు లోకి వచ్చాయి. ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులను హైకోర్టు జడ్జి జస్టిస్ కె. లక్ష్మణ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కోర్టు సీనియర్ జడ్జి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ మనో చౌదరి, మల్కాజ్గిరి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి తదితర న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, త్వరలోనే మల్కాజ్గిరి కోర్టు అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణంలో ఉన్న నూతన భవనంలోకి మారుతుందని తెలిపారు. కోర్టుల సంఖ్య పెరగడం వల్ల కేసుల పరిష్కారం వేగవంతమవుతుందని, ప్రజలకు న్యాయం త్వరగా అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి న్యాయవాదులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జస్టిస్ లక్ష్మణ్, అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మూడు కొత్త కోర్టుల ప్రారంభం కీలక ముందడుగుగా అధికారులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రైల్వే టైమ్ టేబుల్ నుంచి క్రెడిట్ స్కోరు.. జనవరి నుంచి కీలక మార్పులు






ఆర్థిక విషయాల్లో 2025లో చాలా మార్పులు వచ్చాయి. సామాన్యులపై ప్రభావం చూపే ఆదాయపు పన్ను ఊరట, జీఎస్టీ రేట్ల తగ్గింపు వంటి మార్పులు చోటుచేసుకున్నాయి. రైల్వేకు సంబంధించి కొత్త రూల్స్ అమల్లోకి వచ్చాయి. ఇప్పుడు 2026లోనూ ఆ ఒరవడి కొనసాగనుంది. సామాన్యుల జేబులు, నిత్య జీవితంపై ప్రభావం చూపే మార్పులు రాబోతున్నాయి. కొత్త ఆశలు, ఆశయాలతో కొత్త ఏడాదిలోకి ప్రవేశిస్తున్న వేళ అవేంటో చూసేద్దాం..

క్రెడిట్ బ్యూరోల వద్ద ఇప్పటివరకు 15 రోజులకోసారి క్రెడిట్ స్కోర్ అప్‌డేట్ అవుతోంది. ఇకపై బ్యాంకులు వారానికోసారి బ్యూరోలకు నివేదించాలి. జనవరి 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. దీనివల్ల రుణ అర్హత, క్రెడిట్ హిస్టరీ వంటివి త్వరగా వినియోగదారుల క్రెడిట్ స్కోరులో ప్రతిబింబిస్తాయి. డిసెంబర్ 31తో 7వ వేతన కమిషన్ గడువు ముగియనుంది. 8వ వేతన కమిషన్ జనవరి 1 నుంచి ప్రారంభమవుతుంది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనప్పటికీ.. వేతన పెంపు నిర్ణయాలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీన వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఊరట కలగనుంది. కొత్త ఏడాదిలో రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు జరగనున్నాయి. కొత్త టైం టేబుల్ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు సహా మొత్తం 25 రైళ్లు వేళలు మారనున్నాయి. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్‌లో (ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు) బుకింగ్‌కు సంబంధించి నిబంధనలను రైల్వే శాఖ మరింత కఠినతరం చేస్తోంది. ప్రస్తుతం జనరల్ రిజర్వేషన్ విండో తెరుచుకున్న వెంటనే ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్‌సైట్‌లో తొలి 15 నిమిషాల్లో ఆధార్ అథంటికేటెడ్ వ్యక్తులకు మాత్రమే రిజర్వేషన్ అవకాశం ఉంది. ఈ సమయాన్ని డిసెంబర్ 29, 2025 నుంచి నాలుగు గంటలకు పెంచింది. అంటే ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు టికెట్ బుక్ చేయాలంటే ఆధార్ అథంటికేటెడ్ అకౌంట్లకే అవుతుంది. ఇక జనవరి 5 నుంచి ఈ సమయం సాయంత్రం 4 వరకు; 12వ తేదీ నుంచి రాత్రి 12 గంటల వరకు పెంచనుంది. దీని వల్ల టికెట్ల అక్రమాలకు చెక్ పెట్టాలని రైల్వే శాఖ భావిస్తోంది. జనవరి 1 నుంచి కార్లు, బైకుల ధరలు పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, నిస్సాన్, రెనో, జేఎస్‌డబ్ల్యూ, ఎంజీ మోటార్, బీవైడీ కంపెనీల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ కూడా తన స్కూటర్లపై రూ.3 వేలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎల్‌పీజీ, కమర్షియల్ గ్యాస్, ఏటీఎఫ్ ధరలను ప్రతి నెలా 1న చమురు కంపెనీలు సవరిస్తుంటాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గిన నేపథ్యంలో ఈసారి కమర్షియల్ సిలిండర్ ధర తగ్గే అవకాశముంది. దీంతోపాటు ఐటీ రిటర్నులకు సంబంధించిన కొత్త ఫారాలు జనవరిలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఇషా అంబానీ సారథ్యం.. రిలయన్స్ రిటైల్ సరికొత్త రికార్డ్!



ఇషా అంబానీ నాయకత్వంలో.. రిలయన్స్ రిటైల్ 2025లో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఏడాది ముగిసే సమయానికి దేశంలో రిలయన్స్ రిటైల్ స్టోర్ల సంఖ్య 7000 కంటే ఎక్కువ నగరాల్లో.. 20వేలకు చేరుకుంది. ఇందులో ఒక బిలియన్ కంటే ఎక్కువ కస్టమర్ లావాదేవీలను నెరవేర్చడమే కాకుండా.. లక్షలాది మంది భారతీయులకు ప్రాథమిక షాపింగ్ గమ్యస్థానంగా దాని స్థానాన్ని బలోపేతం చేసింది.

రిలయన్స్ 48వ వార్షిక సర్వసభ్య సమావేశంలో.. ఫిజికల్ స్టోర్లే మొత్తం వ్యవస్థకు వెన్నెముక అని ఇషా అంబానీ పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ ఏడాది వస్తువులను ఆర్డర్ చేసిన 30 నిమిషాల్లో డెలివరీ చేసేలా లాజిస్టిక్స్‌ను మార్చారు. 600 కొత్త డార్క్ స్టోర్లు ఏర్పాటు చేశారు. జియోమార్ట్ 1,000కి పైగా నగరాల్లో విస్తరించింది. Ajio Rush ద్వారా ఫ్యాషన్ ఉత్పత్తులు కూడా డెలివరీ చేయడం ప్రారంభమైంది. ఇవన్నీ కంపెనీ అమ్మకాలను గణనీయంగా పెంచడంలో దోహదపడ్డాయి.

గ్లోబల్ బ్రాండ్ ఉత్పత్తులను.. భారతీయులకు చేరువ చేయడంలో ఇషా అంబానీ కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'షీన్' బ్రాండ్‌ను ఇండియాకు తీసుకురావడం ద్వారా లక్షలాది మంది యువతను ఆకట్టుకున్నారు. ఫ్రెంచ్ బ్రాండ్ Maje, యువత కోసం Yousta, Azorte వంటివాటిని పరిచయం చేశారు. వీటికి పట్టణాల్లో మంచి ఆదరణ లభించింది.

ప్రజలను ఆకట్టుకునే ఉత్పత్తులను ప్రవేశపెట్టడంతో.. రిలయన్స్ రిటైల్ ఆర్థికంగా 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ FMCG విభాగం, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, దాని రెండవ సంవత్సరంలోనే రూ.11,500 కోట్ల మైలురాయి టర్నోవర్‌ను సాధించింది. రాబోయే రోజుల్లో కంపెనీ ఏటా 20 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది.

# వెండి ధర ఢమాల్..




ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన వెండి దూకుడుకు బ్రేక్ పడింది. ఫ్యూచర్ మార్కెట్‌లో ఒక్కసారిగా ఢమాల్‌మని కిందకు పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర గంటలోనే రూ.21 వేలు మేర తగ్గింది. సోమవారం ఇంట్రాడేలో రూ.2,54,174 వద్ద గరిష్ఠాన్ని తాకిన కిలో వెండి ధర రూ.2,33,120 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అటు స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర దిగి వచ్చింది. రూ.2.50 లక్షలు పైబడి పలికిన కేజీ వెండి ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయానికి రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది.


భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండికి ఎక్కడా లేని డిమాండ్ ఏర్పడింది. మరీ ముఖ్యంగా వెండి ఎన్నడూ లేని రీతిలో దూసుకెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఒక్కసారిగా ఇటీవల భారీగా దూసుకెళ్లింది. దీంతో సోమవారం ఓ దశలో 80 డాలర్లు పైకెగిసింది. గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది.

రష్యా ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక అడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్స్కీ ఇద్దరూ పూర్తి సుముఖంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించడం యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాల వేళ వెండి ధర పతనం అయ్యింది.

వెండి ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు 181శాతం మేర పెరిగింది. గరిష్ఠాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ వెండి ధర పతనానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వెండి 200డే మూవింగ్ యావరేజీ కంటే 89 శాతం పైనే ట్రేడవుతోంది.

వెండిలో అమ్మకాల ఒత్తిడికి చికాగో మర్చంట్ ఎక్స్ఛేంజీ కూడా మరో కారణం. ఈ గ్రూప్‌లో ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌లను నిర్వహిస్తోంది. 2026 మార్చి ఫ్యూచర్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మార్జిన్‌ను 20వేల డాలర్ల నుంచి 25వేల డాలర్లకు పెంచింది. దీంతో అధిక రిస్క్ తీసుకునే వారు వెనకడుగు వేయడంతో వెండిలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరగడానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

# పెట్రోల్, సీఎన్‌జీ వాహనాలకు గ్రీన్ సెస్?: ధరలు పెరిగే ఛాన్స్




డీజిల్ కార్లపై ప్రస్తుతం విధించే గ్రీన్ సెస్‌ను.. ఢిల్లీ ప్రభుత్వం పెట్రోల్, CNG వాహనాలపై విధించే అవకాశం ఉంది. దీనివల్ల కార్ల ధరలు మరింత పెరగనున్నాయి. ఎలక్ట్రిక్ వాహన విధానం ముసాయిదాలో భాగమైన ఈ ప్రతిపాదన ప్రకారం సెస్ అమలు చేయనున్నారు. మార్చి నాటికి ఈ విధానాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ ప్రభుత్వం.. ఈవీలను ప్రోత్సహించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే.. డీజిల్, పెట్రోల్, CNG వాహనాల కొనుగోలును తగ్గించాలి. దీనికోసం ధరలను పెంచాలని నిర్ణయించుకున్నట్లు.. రవాణా శాఖ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

సెంట్రల్ వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. ఢిల్లీలో ప్రతి నెలా జరిగే అన్ని వాహనాల రిజిస్ట్రేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాలు 12 14% వాటా కలిగి ఉన్నాయి. ఈ సంవత్సరం నమోదైన సుమారు 8,00,000 వాహనాలలో, దాదాపు 1,11,000 ఎలక్ట్రిక్ వాహనాలు. ఈ సంఖ్యను మరింత పెంచే యోజనలో ప్రభుత్వం కొత్త నిర్ణయాలను తీసుకుంటోంది.

# భూగర్భంలో విలువైన సంపద.. భారత్‌లో ఎక్కడుందంటే?



ఖనిజ సంపదకు ప్రసిద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ ఒకటి. ఇక్కడ ఇనుము, బొగ్గు, మాంగనీస్ వంటి వాటితో పాటు బంగారం కూడా ముఖ్యమైన ఖనిజ వనరు. ఇతర ఖనిజాల విషయాన్ని పక్కన పెడితే.. బంగారం భారతీయ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, సంప్రదాయాలలో విశిష్ట స్థానం పొందింది. వివాహాలు, పండుగలు, ఆభరణాలు, పెట్టుబడులు వంటి అనేక రంగాల్లో పసిడిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అందువల్ల భారతదేశంలోని బంగారు గనులు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

భారతదేశంలో ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం బంగారు గనులకు కేంద్రంగా నిలిచింది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ఇండియాలో మాత్రమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలంలో విస్తృతంగా తవ్వకాలు జరిపారు. అయితే ప్రస్తుతం కొన్ని ఆర్థిక సాంకేతిక కారణాల వల్ల క్లోజ్ చేశారు.

కర్ణాటకలోని హట్టి గోల్డ్ మైన్స్.. ప్రస్తుతం భారతదేశంలో క్రియాశీలంగా పనిచేస్తున్న అత్యంత ముఖ్యమైన బంగారు గని. రాయచూర్ జిల్లాలో ఉన్న ఈ గనులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. బంగారు ఉత్పత్తిలో హట్టి గనులు ప్రస్తుతం ప్రధాన వనరుగా నిలుస్తున్నాయి. లేటెస్ట్ టెక్నాలజీలను ఉపయోగిస్తూ.. ఇక్కడ తవ్వకాలు కొనసాగుతున్నాయి.

కర్ణాటక మాత్రమే కాకుండా.. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాల్లో కూడా బంగారు నిక్షేపాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రామగిరి (అనంతపురం జిల్లా) ప్రాంతం పూర్వకాలంలో బంగారు తవ్వకాలకు ప్రసిద్ధి. కడప, చిత్తూరు జిల్లాల కొన్ని ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలు గుర్తించారు. అదే విధంగా తెలంగాణలోని రామగిరి (పెద్దపల్లి జిల్లా) ప్రాంతం కూడా చారిత్రకంగా బంగారు గనులకు ప్రసిద్ధి చెందింది.

ఇవి కాకుండా.. ఝార్ఖండ్ రాష్ట్రంలోని సింగ్‌భూమ్ జిల్లా, రాజస్థాన్‌లోని బనాస్‌వారా, ఉదయ్‌పూర్ ప్రాంతాలు, కేరళలోని వయనాడు జిల్లా మొదలైన ప్రాంతాల్లో కూడా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ ప్రాంతాల్లో జరిగే తవ్వకాలకు పరిమితులు విధించారు. కాబట్టి ఇక్కడ విరివిగా తవ్వకాలు జరపడం నిషిద్ధం.

బంగారు గనుల తవ్వకాలు అనుకున్నంత సులభమేమీ కాదు. ఈ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లోతైన గనులు, అధిక వ్యయం, పర్యావరణ సమస్యలు, ఆధునిక సాంకేతిక అవసరాలు వంటి అంశాలు తవ్వకాలను ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ, దేశీయంగా బంగారు ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం కొత్త అన్వేషణలు, ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తోంది.

# లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



సోమవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాలను చవిచూసింది. సెన్సెక్స్ 345.91 పాయింట్లు, లేదా 0.41 శాతం నష్టంతో 84,695.54 వద్ద, నిఫ్టీ 100.20 పాయింట్లు లేదా 0.38 శాతం నష్టంతో 25,942.10 వద్ద నిలిచాయి. ప్రకాష్ స్టీలేజ్, రాజనందిని మెటల్, కంట్రీ కాండోస్ లిమిటెడ్, ఓరియంట్ బెల్, క్యూబెక్స్ ట్యూబింగ్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. మోడీ రబ్బరు, బ్రూక్స్ లాబొరేటరీస్, టీమో ప్రొడక్షన్స్ హెచ్‌క్యూ లిమిటెడ్, ఫిలాటెక్స్ ఫ్యాషన్స్, పిల్ ఇటాలికా లైఫ్‌స్టైల్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు `రంగారెడ్డి విషయంలోసీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి దోపిడీని అడుఆర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం ?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూ



రంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఉద్యోగులకు పిఆర్సి ఏమయ్యింది

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని మాజీ మంత్రి గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కారారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు. కానీ.. ఇవాళ ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు రావలిసిన బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరు డీఏలు పెండిరగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగుకలకు పీఆర్‌సీ ఇవ్వలేదు. గతంలో కేసీఆర్ హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పీఆర్‌సీ ఇచ్చిన విషయాన్ని హరీష్‌రావు అసెంబ్లీ వేదికగా



గుర్తుచేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన అన్నారు. అంతేకాక, ఇవాళ రిటైరయిన ఉద్యోగులు తమకు రావలిసిన బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడిరచారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా పెండిరగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ పెన్సన్ స్కీమ్‌ను ఓపీఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సిన కాంట్రీబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సీపీఎస్ కట్టకుండా, ఓపీఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని, దయచేసి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఓపీఎస్‌ను త్వరగా అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీష్ అన్నారు.

# సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

- సినీనటి మాధవీలతకు బిగ్ షాక్
- సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్,డిసెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్



మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# పాకిస్తాన్‌లో13 మంది ఉగ్రవాదులు మృతి

పాకిస్తాన్ బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో వివిధ నిఘా ఆధారిత కార్యకలాపాలలో పాకిస్తాన్ భద్రతా దళాలు నిషేధిత తిరుగబాటు గ్రూపులకు చెందిన 13 మంది ఉగ్రవాదుల్ని హతమార్చాయి. ఈ విషయాన్ని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) శనివారం వెల్లడించింది. డిసెంబర్ 24, 25 తేదీల్లో ప్రావిన్స్‌లోని కోప్లూ, కలాట్ ప్రాంతాల్లో నిర్వహించిన రెండు ఆపరేషన్లలో ఈ ఉగ్రవాదులు హతమైనట్లు మిలటరీ మీడియా విభాగం, ఐఎస్‌పిఆర్ తెలిపింది. రెండు ప్రకటనల్లో ఆయా ప్రాంతాలలో ఉగ్రవాదులపై నిఘా ఆధారిత కార్యకలాపాలు నిర్వహించినట్లు ఐఎస్‌పిఆర్ తెలిపింది. కొప్లులో చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు, డిసెంబర్ 25న కలాట్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఎనిమిది మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు ఐఎస్‌పిఆర్ వెల్లడించింది. సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్స్‌లో మొత్తంగా 13 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, మందుగుండి సామాగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు భద్రతా దళాలు ప్రకటనలో తెలిపాయి. ఇక ఈ నెల ప్రారంభంలో కలాట్‌లో భద్రతా దళాలు 12 మంది ఉగ్రవాదులను హతమార్చాయి. గత కొంతకాలంగా పాకిస్తాన్ భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా 'అజ్మ్‌ఎఇస్తేకామ్' ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి.



# పౌరులు, ప్రార్థనా స్థలాలపై దాడులు ఆమోదయోగ్యం కాదు


సిరియాలోని హోమ్స్‌లోని అలీ బిన్ అబీ తాలిబ్ మసీదులో శుక్రవారం ప్రార్థన సమయంలో ఉగ్రదాడి జరిగింది. ఈ దాడిలో ఎనిమిది మృతి చెందారు. ఈ దాడిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శనివారం ఖండించారు. ఈ ఘటనలో మృతులకు ఆయన సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సిరియాలోని హోమ్స్‌లోని అలీ బిన్ అబీ తాలిబ్ మసీదు వద్ద శుక్రవారం ప్రార్థనల సమయంలో జరిగిన ఘోరమైన ఉగ్రవాద



దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. పౌరులు, ప్రార్థనా స్థలాలపై దాడులు ఆమోదయోగ్యం కాదు. మృతుల కుటుంబాలకు నా సంతాపం. గాయపడిన వారందరికీ నా సానుభూతి. వారు త్వరగా పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని గుటెరస్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# నెహ్రూ లేఖలు దేశ ఆస్తి, వాటిని తిరిగి ఇచ్చేయండి

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ)కు సంబంధించిన కీలక పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది.వాటిని వెంటనే 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ'కి తిరిగి అప్పగించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆదివారం (డిసెంబర్ 28, 2025) మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కోరారు. ఆ పత్రాలు ఏ ఒక్క వ్యక్తికో, కుటుంబానికో చెందిన ప్రైవేట్ ఆస్తి కాదని, అవి దేశ వారసత్వ సంపద అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఇందిరా గాంధీ భద్రత కోసం వీటిని మ్యూజియానికి అప్పగించారని, అయితే 2008లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సోనియా గాంధీ ఆదేశాల మేరకు 51 పెట్టెల్లో (దాదాపు 26,000 పత్రాలు) వీటిని ఆమె నివాసానికి తరలించారని షెకావత్ వెల్లడించారు. ఈ పత్రాలలో నెహ్రూ రాసిన వ్యక్తిగత లేఖలు, ఆయనకు వచ్చిన సమాధానాలు, ముఖ్యమైన నోట్స్ ఉన్నాయని, ఇవి పరిశోధకులకు, చరిత్రకారులకు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ పత్రాల కోసం మ్యూజియం ఇప్పటికే 2025 జనవరి, జూలైలో రెండుసార్లు సోనియా గాంధీకి లేఖలు రాసిందని, ఆమె కూడా సహకరిస్తానని సమాధానం ఇచ్చారని, కానీ ఇంతవరకు అవి తిరిగి రాలేదని ఆయన గుర్తు చేశారు. దేశ చరిత్రను నిష్పాక్షికంగా తెలుసుకునే హక్కు పౌరులకు ఉందని, కాబట్టి వాటిని పబ్లిక్ ఆర్కైవ్స్‌లో ఉంచాలని ఈ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ డిమాండ్ చేశారు.



# విదేశీ వాణిజ్య చట్టానికి చైనా సవరణ

విదేశీ వాణిజ్య చట్టానికి చైనా సవరణ చేసింది. ఈ సవరణను నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. తాజా సవరణ సరిహద్దు ఆర్థిక సేవలు, డిజిటల్ సర్టిఫికెట్ల పరస్పర గుర్తింపునకు ఊతమివ్వనున్నది. ఈ సవరించిన చట్టం 2026 మార్చి 1 నుంచి అమల్లోకి వస్తుందని చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. మీడియా సమావేశంలో జాతీయ ప్రజాసభ శాసన వ్యవహారాల కమిషన్ ప్రతినిధి హువాంగ్ హైహువా మాట్లాడుతూ.. ఈ సవరణల ప్రధాన లక్ష్యాలు చైనాను బలమైన వాణిజ్య దేశంగా తీర్చిదిద్దడం, న్యాయమైన అంతర్జాతీయ ఆర్థికవాణిజ్య వ్యవస్థను రక్షించడం, వివిధ మార్గాల ద్వారా అంతర్జాతీయ సేవల వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, అలాగే వాణిజ్య ప్రోత్సాహక వేదిక సేవా సామర్థ్యాన్ని పెంచడమేనని తెలిపారు. చైనా విదేశీ వాణిజ్య చట్టం తొలిసారిగా 1994లో అమల్లోకి వచ్చింది. 2004లో ఒకసారి సవరించారు. తాజా సవరణలతో ఈ చట్టం ఇప్పుడు 11 అధ్యాయాలుగా రూపొందించబడిందని జిన్హువా వివరించింది. విదేశీ వాణిజ్య నైపుణ్య వనరుల అభివృద్ధి ఈ చట్ట సవరణలో ఒక ముఖ్యమైన అంశంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) అధ్యయన సంఘం కార్యవర్గ సభ్యులు లీ యోంగ్ తెలిపారు. విదేశీ వాణిజ్య చట్ట సవరణ తక్షణమే విదేశీ వాణిజ్యాన్ని స్థిరీకరించడమే కాకుండా.. దీర్ఘకాలంలో నాణ్యమైన, స్థిరమైన వాణిజ్య అభివృద్ధికి పటిష్టమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సవరణలు చైనా కమ్యూనిస్టు పార్టీ రూపొందించిన 15వ ఐదేండ్ల ప్రణాళిక లక్ష్యాలకు పూర్తి అనుగుణంగా ఉండి, చైనాను బలమైన వాణిజ్య దేశంగా మార్చే దిశగా ముందడుగు వేస్తాయని ఆయన తెలిపారు.





# విమాన సర్వీసులకు అంతరాయం

న్యూఢిల్లీ : దేశ రాజధానిని పొగమంచు కప్పేసింది. అతి సమీపంలోని వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురవడంతో వాతావరణ శాఖ దిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి వాతావరణం దారుణంగా మారడంతో రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి.సోమవారం తెల్లవారుజామున ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ 403గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వివేక్ విహార్ (460), ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్ (444) ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నామన్నారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన పొగమంచు వల్ల రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. ఢిల్లీ విమానాశ్రయం సైతం ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. ప్రయాణికులు విమానాల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని విమానయాన సంస్థలకు కస్టమర్ సపోర్ట్ ఫోన్ నంబర్‌లను విడుదల చేసింది.

# డెహ్రాడూన్‌లో జాత్యహంకార దాడి..

**త్రిపుర విద్యార్థి మృతి**



ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరిగిన ఘోరమైన దాడిలో త్రిపురకు చెందిన 24 ఏళ్ల ఎంబీఏవిద్యార్థి ఏంజెల్ చక్మా ప్రాణాలు కోల్పోయాడు. డిసెంబర్ 9వ తేదీన సెలాకుయ్ ప్రాంతంలోని ఒక హోటల్ వద్ద ఏంజెల్ చక్మా, అతని సోదరుడు మైఖేల్ చక్మాపై కొంతమంది స్థానిక యువకులు జాతి వివక్షతో కూడిన వ్యాఖ్యలుచేస్తూ గొడవకు దిగారు. వారు 'చైనీస్' అని దూషించగా, తాము భారతీయులమేనని ఏంజెల్ సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి, నిందితులు కత్తులు, ఇనుప కడాలతో ఏంజెల్ తల, వీపుపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలైన ఏంజెల్ ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు 17 రోజుల పాటు మృత్యువుతో పోరాడి, డిసెంబర్ 25న మృతి చెందాడు. ఈ ఘటనపై డెహ్రాదూన్ పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో అవినాష్ నేగి, సూరజ్ ఖవాస్, సుమిత్‌తో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితుడైన నేపాల్‌కు చెందిన యజ్ఞ అవస్థి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు ముమ్మరం చేస్తూ రూ. 25,000 రివార్డును ప్రకటించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, ఉత్తరాఖండ్ సీఎంతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. డెహ్రాదూన్‌లో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వెల్లుల్లిని ఇలా తింటే గుండె పదిలం..!



ఉదయాన్నే పరగడుపున ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బల్ని తినటం వల్ల బోలెడన్నీ లాభాలు ఉన్నాయి. వెల్లుల్లిని నమిలి తినడం ఇష్టం లేకపోతే నీటితో కలిపి మింగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి ముక్కల్ని తేనెలో కలిపి తీసుకోవచ్చు. ఈ రెండిటీని కలిపి తీసుకోవడం వల్ల గుండె నాళాలు ఆరోగ్యంగా మారుతాయి. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది జలుబు, ఫ్లూ, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించబడతాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. ఉదయాన్నే పరగడుపున ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బల్ని తినటం వల్ల బోలెడన్నీ లాభాలు ఉన్నాయి. వెల్లుల్లిని నమిలి తినడం ఇష్టం లేకపోతే నీటితో కలిపి మింగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి ముక్కల్ని తేనెలో కలిపి తీసుకోవచ్చు. ఈ రెండిటీని కలిపి తీసుకోవడం వల్ల గుండె నాళాలు ఆరోగ్యంగా మారుతాయి. వెల్లుల్లి టీ తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. మరిగించిన నీటిలో వెల్లుల్లి రెబ్బల్ని కలిపి తాగితే రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. పాలలో వెల్లుల్లి కలిపి మరిగించాలి. ఈ పాలను రాత్రి పడుకునే ముందు తాగితే కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా మారుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసంలో వెల్లుల్లి రెబ్బలు లేదా వెల్లుల్లి పేస్ట్ కలిపి తాగాలి. దీని వల్ల ధమనులు ఆరోగ్యంగా మారుతాయి. కొంతమందికి పచ్చి వెల్లుల్లి పడదు. అటువంటి వారు వెల్లుల్లిని వేయించి తినొచ్చు. వేయించిన వెల్లుల్లి బీపీని కంట్రోల్ చేస్తుంది. మొలకెత్తిన వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కండరాల్ని బలంగా ఉంచుతాయి. వెల్లుల్లి పొడి చేసుకొని ఆహార పదార్థాల్లో కలిపి తీసుకోవచ్చు. వెల్లుల్లి పొడిని మజ్జిగలో కలిపి కూడా తీసుకోవచ్చు. వెల్లుల్లి రెబ్బల్ని ఆలివ్ ఆయిల్‌లో నానబెట్టి తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్‌తో కలిపి తీసుకుంటే గుండె ఆరోగ్యంగా మారుతుంది. వెల్లుల్లి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీన్ని రోజూ తినడం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వెల్లుల్లి జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది శరీరం కొవ్వును వేగంగా కాల్చడానికి సహాయపడుతుంది. ఉదయం పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తినడం వల్ల బరువు తగ్గవచ్చు. వెల్లుల్లి శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు కాలేయాన్ని నిర్విషీకరణ చేసి, శరీరాన్ని ఆరోగ్యంగా, శక్తితో నింపుతాయి. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, అజీర్ణం మరియు మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లిలోని యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మాన్ని స్పష్టంగా, ప్రకాశవంతంగా మార్చడంలో సహాయపడతాయి. ఇది జుట్టు రాలడాన్ని నివారించడంలో మరియు జుట్టును బలోపేతం చేయడంలో కూడా సహాయపడుతుంది.



# పల్లీలు వీరు తినకూడదు!

వేరుశెనగకు అలెర్జీ ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే అవి గొంతు నొప్పి, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, శ్వాస ఆడక పోవడానికి కారణమవుతాయి. కొంతమందికి పల్లీలు పడవు. వీరికి పల్లీలు తినగానే వాంతులు, పెదాలు ఉబ్బడం, నాలుక మొద్దుబారిపోవడం, గొంతు వాచినట్లుగా అవ్వడం జరుగుతుంది. ఇలాంటి వారు పల్లీలకు దూరంగా ఉండటం మేలు. వేరుశెనగ తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. ఈ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వేరుశెనగకు అనేక ప్రతికూలతలు కూడా ఉన్నాయి. వేరుశెనగకు అలెర్జీ ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే అవి గొంతు నొప్పి, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, శ్వాస ఆడకపోవడానికి కారణమవుతాయి. కొంతమందికి పల్లీలు పడవు. వీరికి పల్లీలు తినగానే వాంతులు, పెదాలు ఉబ్బడం, నాలుక మొద్దుబారిపోవడం, గొంతు వాచినట్లుగా అవ్వడం జరుగుతుంది. ఇలాంటి వారు పల్లీలకు దూరంగా ఉండటం మేలు. ఆస్తమా వంటి శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు పల్లీలు తినకపోవడమే మంచిది. ఇది ఈ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే శ్వాస సమస్యలు ఉంటే జీడిపప్పు, బాదం, గుమ్మడి గింజలు వంటివి తినడం మేలు. పల్లీలు తినగానే కొంతమందికి చర్మంపై ర్యాషెస్ వస్తాయి. ఇలా దద్దుర్లు వస్తే కూడా పల్లీలకు వీలైనంత దూరంగా ఉండటం మేలు. ఫ్యాటీ లివర్ వంటి కాలేయ సంబంధ సమస్యలు ఉన్నవారు కూడా పల్లీలు తినొద్దు. ఎందుకంటే పల్లీలు లివర్‌లో కొవ్వు పెంచి సమస్యను తీవ్రతరం చేస్తాయి. రక్తం పల్చబడటం కోసం కొంతమంది మెడిసిన్ వాడుతుంటారు. ఇలాంటి వారు పల్లీలు తీసుకోకపోవడమే మంచిది. పల్లీలలో ప్రోటీన్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది కిడ్నీ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే దీర్ఘకాల కిడ్నీ సమస్యలు ఉన్నవారు పల్లీలకు దూరంగా ఉండాలి. పల్లీలు ఎక్కువగా తింటే బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పల్లీలను మితంగా తీసుకోవడం మంచిది. ఉడికించిన లేదా వేయించిన పల్లీలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ ఉప్పు కలిపిన, డీప్ ఫ్రై చేసిన పల్లీలు అస్సలు తినకూడదు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు 50గ్రాముల పల్లీలు తినడం మంచిది. బరువు తగ్గాలని చూసేవారు రోజుకు 30గ్రాములకు మించి పల్లీలు తీసుకోకపోవడమే మంచిది.

# బీరకాయ డైట్‌తో బోలెడన్నీ లాభాలు!



భారతదేశంలో చాలా సాధారణంగా తినే కూరగాయ బీరకాయ. ఇది వివిధ రకాల పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. దీనితో తయారు చేసిన వంటకాలు చాలా మంది ఇష్టంగా తింటుంటారు. ఇది మృదువుగా, సులభంగా కరుగుతుంది. కాబట్టి దీనిని వండటం కష్టం కాదు. అంతేకాదు..క్రమం తప్పకుండా తినడం వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? బీరకాయలో నీరు పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇది మీ శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. బీరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుకోవచ్చు. బీరకాయలో ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీనిని తినడం ద్వారా మలబద్ధకం, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి జీర్ణ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. జీర్ణశక్తి బాగుంటుంది. ఈ కూరగాయలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అలాగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగకుండా కాపాడుతుంది. తద్వారా డయాబెటిస్ ముప్పు తగ్గించుకోవచ్చు. బీరకాయ నేచురల్ డీటాక్సిఫయర్ లాగా పనిచేసి కాలేయాన్ని శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. కాలేయం నుంచి విష పదార్థాలను బయటకు పంపిస్తుంది. తద్వారా ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. బీరకాయలో కేలరీలు తక్కువగా, వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది తింటే తొందరగా కడుపు నిండి ఆకలి తగ్గుతుంది. తద్వారా ఫ్యాట్ ఏర్పడకుండా ఉంటుంది. బరువు అదుపులో ఉంటుంది. బీరకాయలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇంఫ్లమేటరీ గుణాలు కీళ్ల మంట, వాపు నుంచి కాపాడుతాయి. కీళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీరకాయలో యాంటీ ఆక్సిడెంట్లు, వాటర్ కంటెంట్ చర్మాన్ని మృదువుగా ఉంచుతాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మ కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతాయి. తద్వారా స్కిన్ హెల్తీగా ఉంటుంది. మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు బీరకాయలో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటు పెరగకుండా కాపాడి గుండెపై ఒత్తిడి నివారిస్తాయి. తద్వారా వయసు పెరిగినా గుండెను బలంగా ఉంచుకోవచ్చు. బీరకాయలో యాంటీ ఇంఫ్లమేటరీ గుణాలు, వాటర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కిడ్నీల వడబోత ప్రక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.



# ఈ-సిగరెట్ ఇంత ప్రమాదకరమా?


## మహిళ కంటి చూపు కోల్పోయింది!

ఇటీవల కాలంలో ఈ-సిగరేట్ లేదా వేపింగ్ చేస్తున్న వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ధూమపానం కంటే ఈ-సిగరెట్ అంత ప్రమాదకరం కాదని వారు చెబుతుంటారు. కానీ, పలు నివేదికలు మాత్రం ఈ-సిగరెట్లు చాలా ప్రమాదకరమని చెబుతున్నాయి. సాధారణ ధూమపానం కంటే ఆరోగ్యానికి ఎంతో నష్టం కలిగిస్తుందంటున్నాయి. తాజాగా, ఈ-సిగరెట్ ఎక్కువగా సేవించిన ఓ మహిళ ఏకంగా తన కంటి చూపునే కోల్పోయింది. ప్రస్తుతం కాలంలో చాలా మంది సిగరెట్లు తాగుతుంటారు. అయితే, కొంతమంది దీనికి ప్రత్యామ్నాయంగా ఈ-సిగరెట్లను ఎంచుకుంటున్నారు. ధూమపానం కంటే ఇది తక్కువ ప్రమాదకరమని, శరీరానికి తక్కువ హానికరమనే భావన చాలా మందిలో ఉంది. వేపింగ్ వాడటం వల్ల శరీరంపై ఎలాంటి తీవ్రమైన ప్రభావాలు ఉండవని చాలా మంది వాదిస్తుంటారు. కానీ, తాజాగా, జరిగిన ఓ ఘటన మాత్రం అవన్నీ వాస్తవాలు కాదని తేల్చింది. ఈ-సిగరెట్లు కూడా చాలా ప్రమాదకరమని రుజువు చేసింది. ఓ మహిళ అధికంగా వేపింగ్ చేసిన కారణంగా ఆమె తన కంటి చూపును కోల్పోయింది. ఈ విషయాన్ని డాక్టర్ మేఘ కర్నావత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. డయాబెటిస్, బీపీ వంటి వ్యాధులు లేని 40 ఏళ్ల మహిళ రాత్రిపూట అధిక మోతాదులో వేపింగ్ చేసింది. అనంతరం ఉదయం లేచిన తర్వాత ఆమె పూర్తిగా కంటి చూపును కోల్పోయిందని తెలిపింది. వేపింగ్ వల్ల ఆరోగ్యానికి కలిగే దుష్ప్రభావాలను ఆమె వివరించారు.

# ఈ ఒక్క డ్రింక్ డైట్‌లో ఉంటే..

## ఈజీగా బరువు తగ్గొచ్చు!

ఈ మధ్య కాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అధిక బరువు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు డైట్‌లు ఫాలో అవ్వడం, జిమ్‌కు వెళ్లడం చేస్తుంటారు. కానీ వాళ్లు ఎంత ప్రయత్నించినా బరువును పూర్తిగా తగ్గించుకోలేరు. అయితే మన పూర్వీకుల కాలం నుంచి ఆచరణలో ఉన్న ఒక చిట్కా మాత్రం ఈ సమస్యను పరిష్కరించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. అదే దాల్చిన చెక్కా నీరు. దాల్చినచెక్క నీటిలోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియను పెంచే లక్షణాల కలిగి ఉంటాయి. ఈ నీటిని రోజూ తాగడం వ్వారా జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. 2026లో ఫ్యాట్‌లాస్ జర్నీని స్టార్ట్ చేసే వారికి ఈ పానియం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే మీకు మరో గుడ్‌న్యూస్ ఏమిటంటే దీనికి మీరు వందలు, వేల రూపాయలు ఖర్చు చేయాల్సి పనిలేదు. చాలా తక్కువ ఖర్చుతో దీనిని తయారు చేసుకోవచ్చు. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి ఈ పానియం ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. అలాగే మీకు అతిగా ఆకలి వేయకుండా ఎక్కువ సేపు కడుపు నిండి అనుభవాన్ని ఇస్తుంది. దీని ద్వారా మీరు తక్కువ తినడానికి దోహదపడుతుంది. మీ రోజు వారి ఆహారంతో పాటు మార్నింగ్ ఈ డ్రింక్‌ను తీసుకుంటే దాని ప్రయోజనాలను పొందచ్చవు. రోగనిరోధక శక్తి: దాల్చినచెక్కలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీమైక్రోబయల్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరం ఇన్ఫెక్షన్లు, వైరస్‌లతో పోరాడి శరీరంలోని విషాన్ని బయటకు పంపుతాయి. రోజూ మార్నింగ్ మీరు ఈ నీటిని తాగడం ద్వారా మీ శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది మీ శరీరానికి లోపల నుంచి శక్తిని అందిస్తుంది. అలాగే కాలానుగన వ్యాధుల నుంచి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. గట్ హెల్త్ : మీ గట్ హెల్త్‌ను కాపాడడంతో కూడా దాల్చినచెక్క నీరు చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను సున్నితంగా ప్రేరేపించి మనం తిన్న ఆహారాన్ని సమర్థవంతంగా ప్రాసెస్ చేస్తుంది. అలాగే ఉబ్బరం, ఎసిడిటీ, గ్యాస్ వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఈ డ్రింక్ ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియాను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గుండె ఆరోగ్యం: ఈ డ్రింక్ రోజూ తాగడం ద్వారా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. తర్వాత రక్తపోటు కూడా తగ్గుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుంది. దాల్చిన చెక్కలో ఉండే ఇన్ఫమేటరీ లక్షణాలు రక్తనాలను రక్షించి గుండె సంబంధించి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తద్వారా మీరు ఎలాంటి గుండె జబ్బుల భారీగా పడకుండా ఉంటారు.



# రోజూ గుడ్లు తింటే ఏమౌతుంది?



ప్రతిరోజూ గుడ్లు తినమని పోషకాహార నిపుణులు పదే పదే చెబుతూనే ఉంటారు. కానీ, ఇటీవల కాలంలో గుడ్లు క్యాన్సర్‌కు కారణమవుతాయనే భయం విస్తృతంగా ప్రచారమవుతోంది. కానీ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ఈ భావనను తోసిపుచ్చింది. అయినప్పటికీ, కొంతమంది ఇప్పటికీ వాటిని తినడానికి భయపడుతున్నారు. దీనికి తోడు కొంతమంది పోషకాహార నిపుణులు గుడ్డు పచ్చసొన తినడం గురించి అపోహలను వ్యాప్తి చేశారు. ఫలితంగా చాలా మంది ప్లేట్స్ నుండి ఈ కంఫర్ట్ ఫుడ్ అదృశ్యమైంది. అయితే, డాక్టర్ శుభం వాట్స్ ఈ అపోహను బహిరంగంగా ప్రస్తావించారు. అతను ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక రీల్‌ను షేర్ చేశాడు. గుడ్లు తినడం వల్ల ఏమౌతుందో కొన్ని వాస్తవాలను వెల్లడించారు. గుడ్డు పచ్చసొనను రాక్షసంగా చూపించడం పోషకాహార నిపుణులు చేసే అతిపెద్ద మోసం అని డాక్టర్ వాట్స్ వివరించారు. మీ కాలేయం మీ శరీరంలోని 80శాతం కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. గుడ్డు పచ్చసొన నుండి మీకు లభించే ఆహార కొలెస్ట్రాల్ రక్త కొలెస్ట్రాల్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 150,000 మందిపై జరిపిన ఒక పెద్ద అధ్యయనంలో ప్రతిరోజూ గుడ్డు తినడం వల్ల గుండెపోటు లేదా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా, లుటీన్, కొల్లాజెన్, గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ముఖ్యమైన విటమిన్లు అధికంగా ఉండే మంచి కొలెస్ట్రాల్ కూడా మెరుగుపడుతుందని స్పష్టంగా తేలింది. అసలైన సమస్య పచ్చసొన కాదు, వంట చేసే విధానం అంటున్నారు. చాలా మంది వెన్న, క్రీమ్, ఎక్కువ నూనెతో గుడ్లను తయారు చేసి తింటూ ఉంటారు. ఆపై తమకు సమస్య ఉందని చెప్పకుంటారు. మీరు ఆరోగ్యకరమైన, మధుమేహం లేని, అధిక రక్తపోటు లేని పెద్దలైతే మీరు ప్రతిరోజూ మూడు గుడ్లు సులభంగా తినవచ్చు అంటున్నారు. చాలా సంవత్సరాలుగా గుడ్డు సొనలు గుండెకు హానికరమని భావించేవారు. కానీ, ఆధునిక శాస్త్రం ఈ అపోహను పూర్తిగా తోసిపుచ్చింది. వాస్తవానికి, కాలేయం మన శరీరంలోని కొలెస్ట్రాల్‌లో ఎక్కువ భాగాన్ని ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల గుడ్డు సొనల నుండి వచ్చే ఆహార కొలెస్ట్రాల్ రక్త కొలెస్ట్రాల్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in